# హస్తము

దేవుని గర్భ గుడిలో ప్రతిమకు ఎంతో విశేషత ఉండగ ఆ ప్రతిమచూపిన హస్తమునకు మరీ విశేషత కలదు. ప్రతిమకున్న హస్తమే మనకు కూడ ఉన్నది. ప్రతిమ చూపిన హస్తములో ఎంతో అర్థమున్నదని గ్రహించిన ఎడల మనహస్తములో కూడ అదే విశేషత ఉన్నదని తెలియగలము. అందువలన దేవాలయములో గల ప్రతిమకున్న హస్తమును గురించి తెలుసుకొందాము. హస్తము యొక్క ఆకారమును బొమ్మలో చూచెదము.


హస్తము మధ్యన మూడు రేఖలున్నవి. ఆ మూడు రేఖలలో క్రింద రెండు రేఖల కొనలు ఒకవైపు ఒకదానితో ఒకటి కలసియున్నవి. మూడువరేఖ క్రిందగల రెండు రేఖల కంటె పైన ఉండి రెండు రేఖలతో కలియకుండ వేరుగ ఉన్నది. వీటి భావమేమనగ భగవద్గీత పురుషోత్తమ ప్రాప్తియోగమను అధ్యాయములో

16 వ శ్లో. *"ద్వా విమౌ పురుషౌ లోకే క్షర శ్చాక్షర ఏవచ*
*క్షర స్సర్వాణి భూతాని కూటస్థో క్షర ఉచ్యతే"*

భూమిమీద రెండు రకముల పురుషులున్నారు. ఆ ఇద్దరిలో ఒకడు క్షరుడు (నాశనమగువాడు) రెండవవాడు అక్షరుడు (నాశనముకాని వాడు)గ ఉన్నారు. క్షరుడనువాడు సర్వ జీవరాసులందు జీవునిగా ఉన్నాడు. అక్షరుడనువాడు సర్వజీవుల శరీరములందు కూటస్థుడుగ కలసి ఉన్నాడను శ్రీకృష్ణ పరమాత్మ మాట ప్రకారము మధ్య హస్తమునందు క్షరాక్షరులను రెండు రేఖలు విడిగా ఉండి కొనలు కలిసి ఉన్నవి. సమస్త శరీరములలో క్షరులుగ ఉన్న జీవాత్మను అట్లే సమస్త శరీరములలో చైతన్యశక్తిగ ఉన్న ఆత్మను సూచించు గుర్తులే హస్తములోని క్రింది రెండు రేఖలని తెలియాలి.

"ఉత్తమః పురుష స్త్వన్యః పరమాత్మే" అను పదిహేడవ శ్లోకములోని వాక్యము ప్రకారము మరియు "యస్మాత్ క్షర మతీతో హ మక్షరాదపి చోత్తమః" అను పద్దేనిమిదవ శ్లోకము ప్రకారము ఇద్దరి పురుషుల కంటే ఉత్తమమైన పురుషుడొకడున్నాడు వాడే పరమాత్మ. వాడు క్షరునికంటే అతీతుడు అక్షరునికంటే శ్రేష్టుడు కావున వానిని పురుషోత్తముడు అంటున్నాము. ఆత్మకంటే వేరుగ ఉన్నాడు కనుక పరమాత్మయని, జీవాత్మ ఆత్మలకంటే ఉత్తమునిగ ఉన్నాడు కనుక పురుషోత్తముడని చెప్పుచున్నాము. పరమాత్మ పురుషోత్తమ అనునవి ఆయన స్థోమతను తెల్పు పదములుగాని వాస్తవముగ అవి పేర్లుకావు. ఇద్దరి పురుషులకంటే వేరుగ అతీతముగ ఉన్నాడు కావున హస్తములో మూడవ రేఖ రెండు రేఖలకంటే వేరుగ పైన గలదు. సృష్టికి కారణమైన సృష్టిలో మూల పురుషులయిన క్షరాక్షర పురుషోత్తముల గుర్తులను తెలియజేయు హస్తము ప్రతిమ చేత చూపబడుచున్నది. ప్రపంచములో ముఖ్యమైన ముగ్గురు మూల పురుషుల విషయము హస్తములో ఉండుటవలన అరచేతిలో అంతా ఉన్నదని, **అరచేతిలో వైకుంఠమున్నదని** పెద్దలనెడివారు. అరచేతిలోని అర్థమేకాక ఒక అరచేయినేకాక హస్తమంత పరికించి చూచెదము.

హస్తమునకు ఐదు వ్రేళ్ళు గలవు. ఐదువ్రేల్లు పంచ భూతములకు, ఐదు జ్ఞానేంద్రియములకు, ఐదు వాయువులకు ప్రతీకగ ఉన్నవి. వీటిని సందర్భానుసారము అర్థము చేసుకోవలయును. ఇచట ఐదు వ్రేళ్ళను పంచభూతములయిన ఆకాశము, గాలి, అగ్ని, నీరు, భూమిగ అర్థము చేసుకోవాలి. హస్తము మధ్యలోగల రేఖలను ముగ్గురు పురుషులుగ ఐదు వ్రేళ్ళు ఐదు ప్రకృతి భాగములుగ లెక్కించుకోవడము వలన మొత్తము ప్రపంచము దానికి ఆధారమైన పరమాత్మ, ఆత్మ, జీవాత్మలు అనగా యావత్ అండపిండ బ్రహ్మాండమంతయు హస్తమునందే తెలియబడునట్లు అర్థముకాగలదు. పంచ భూతములయిన ప్రకృతి పరమాత్మ రెండునూ




హస్తము

హస్తములోనే ఇమిడినట్లు ప్రతిమ చూపడమేకాక ప్రతి ఒక్కరిలోను ప్రకృతి పరమాత్మలున్నట్లు తెలుసుకోవాలని తెలియబడినది.

ఒక మనిషి శరీరములో జీవాత్మ ఆత్మయేకాక పరమాత్మ మరియు ప్రకృతి ఉన్నట్లు హస్తములో తెలియబరచబడి ఉండడమేకాక శరీరములోని మరియొక రహస్యము కూడ బహిర్గతమగుచున్నది. ఆ రహస్యమేమనగా మనిషి ప్రకృతిలో ఉంటే ఏ విధముగ ఉంటాడు, పరమాత్మలోనికి పోతే ఎలాగుంటాడను విషయము. శరీరములోని ప్రకృతిలో చిక్కుకొన్న జీవుడు ప్రకృతి జనితమైన మూడు గుణములందు ఉన్నాడని చూపడము ఒక విధానముకాగ, మూడు గుణములను దాటిన ఎట్లుండునను విషయము మరియు మూడు గుణములను అతిక్రమించి ఉండడము వలన కొంత కాలమునకు జీవుడు పూర్తి ఏ విధముగ మారి పోవునను విషయమును కూడ తెలియబరచబడుచున్నది. ఆ విషయములు హస్తములో ఎట్లున్నది పరికించి చూస్తాము. హస్తమునకున్న వ్రేళ్ళకు మూడు గెణుపులు గలవు. వ్రేళ్ళకున్న అడ్డగీతల వలన ఒక్కొక్క వ్రేళు మూడు భాగములుగ విభజింపబడి కనిపిస్తున్నది. ఐదు వ్రేళ్ళు పంచభూతములకు ప్రతీకకాగ పంచభూతములనబడు ప్రకృతికి మూడు గుణములు పుట్టాయని, పంచభూత నిర్మితమైనవే మూడు గుణములని తెలియునట్లు ఐదు వ్రేళ్ళు మూడు భాగములుగ ఉన్నవి. ప్రకృతిలో పుట్టిన జీవుడు ప్రకృతి గుణములందే చిక్కుకొని ఉన్నాడని గుడిలోని దేవుడు హస్తము చూపి తెలియచేయుచున్నాడు. హస్తములోని అరచేయి మధ్యన ఉండగ అరచేయి క్రింద మనికట్టు మీద మూడు మడతలు కనిపిస్తున్నవి. ఆ గీతలను వ్రేళ్ళలోని గీతలతో చేర్చితే అరచేయి చుట్టు చక్రమేర్పడినట్లున్నది. హస్తము బొమ్మలో చూపినట్లు మూడు రేఖలకు మధ్యలోని అరచేతిలో మూడు ఆత్మలు కనిపిస్తుండగ అరచేతి నుండి వ్రేళ్ళ వైపు మూడు భాగములున్నాయి కదా! అందులో మొదటిది

తామస గుణ భాగమని, రెండవది రాజస గుణ భాగమని, మూడవది సాత్త్వక గుణ భాగమని తెలియాలి. చేతిలో చూపినట్లే శరీరములోని జీవుడు ఈ మూడు గుణములలోనే ఉన్నాడు. గుణములుగ గుర్తించిన చేతి గెనుపులలో సాత్త్వికముగ గుర్తించిన వ్రేళ్ళకొన భాగమయిన గెనుపులలో శంఖు చక్రముల ఆకారముండును. శంఖు జ్ఞానబోధయని, చక్రము కర్మనాశనమని ముందు అధ్యాయములోనే తెలుసుకొన్నాము. జ్ఞానబోధ తెలిసి కర్మనాశనము చేసుకొను విధానమొకటున్నదని తెలియబరచడమే వ్రేళ్ళకు శంఖు చక్రములుండు అర్థమని తెలియాలి. వ్రేళ్ళ చివరలోగల శంఖు, చక్రములను చూచిన తర్వాత దానికి సంబంధించిన విధానము గుణముల వెనకల తెల్లని గోరుగ ఉన్నదని తెలియగలము. మూడు గుణములే కాదు వాటిని వాటి వలన వచ్చు కర్మను జయించెడి యుద్ధము కూడ కలదు అని యుద్ధ చిహ్నములుగ ఉన్న శంఖు చక్రములను వ్రేళ్ళ కొన భాగములో దేవుడు చిత్రించడము జరిగినది. ఇలా ఎన్నో ఆకారములను హస్తములో చిత్రించి ఉండగ కొందరు హస్తములోని రేఖలను, శంఖు చక్రములను జ్యోతిష్యముగ హస్తసాముద్రికముగ చెప్పుకోవడము తప్పు అని గమనించాలి. చివరి భాగములో ఉన్న సాత్త్విక గుణభాగము తర్వాత గోర్లు కనిపిస్తుండును. గోరును చూచినచో వ్రేళ్ళు మూడు గెనుపుల చర్మముకంటే గట్టిగ ఉండి వ్రేళ్ళ రంగుకంటే వేరుగ తెల్లగ ఉండును. మూడు గుణములలో జీవుడు ఉండడమేకాక నాల్గవ స్థానము కూడ జీవునకున్నదన్నట్లు వ్రేళ్ళ కొన భాగములో గోర్లుండడము యొక్క అర్థము. "చాతుర్వర్ణం" అని భగవద్గీతలో చెప్పినట్లు జీవులు సాత్త్వికులు, రాజసులు, తామసులేకాక యోగులు కూడ ఉన్నారు. ప్రకృతిలోని ఆ యోగుల యొక్క స్థానమును తెల్పునదే గోరు. గోరు తెల్లగ ఉండి యోగుల స్పష్టతను తెలియ చేయుచున్నది. యోగులయినవారు జ్ఞానము కల్గియుందురనుటకు లేక జ్ఞానము కల్గినవారే యోగులగుదురనుటకు, జ్ఞానము వలననే యోగము ప్రాప్తించుననుటకు గుర్తుగ జ్ఞానమునకు చిహ్నమైన చంద్రుడు తెల్లని గోరు మీద మరి తెల్లగ కనిపిస్తు ఉండును. ఈ విధముగ వ్రేళ్ళ మూడు గెనుపులు మూడు గుణములుకాగ, చివరగ పైకి కనిపించు గోరు యోగుల స్థానము సూచిస్తున్నది. గోరు మీద ఉదయించు చంద్రుడు జ్ఞానమును సూచిస్తున్నాడు.

మూడు గుణములలో ఉన్న వానికి కష్ట సుఖములుండును. మూడు గుణములు దాటి యోగములో ఉన్నవాడు కూడ కష్ట సుఖములకు లోనగుచుండును. ఎందుకనగా మూడు గుణములందు ఉండిన, యోగములో ఉండిన జీవుడు కష్ట సుఖములనుభవించక తప్పదు. కష్ట సుఖములు పూర్తి లేకుండ పోవలయుననంటే జీవుడు గుణములను యోగమును అన్నిటిని వదలి మోక్షము పొందవలెను. మోక్షము పొందిన వానికి ఏ అనుభూతితోను సంబంధము లేదు. కష్టసుఖ అనుభవము ఏ మాత్రము ఉండవు. అందువలననే మూడు గుణములను సూచించు వ్రేళ్ళ గెనుపులలో కత్తితో కుచ్చిన వెంటనే నొప్పి కనిపించును. యోగమును సూచించు గోరు కూడ వ్రేళ్ళకంటే కొద్ది తేడాతో నొప్పి కనిపించును. మోక్షము పొందిన వానికి ఏ అనుభూతి ఉండదు కావున తెల్ల గోరు చివరలో వేలుకు పై భాగమున చివరలో తెల్లగోరు నుండి నీల వర్ణముగల గోరు మొలచి ఉండును. ఆ గోరు మోక్షమును సూచించుచున్నదై నీలవర్ణముగల్గి ప్రత్యేకముగ ఉండును. మోక్షము పొందిన వానికి కష్టసుఖ అనుభూతులు లేవన్నట్లు, నీలవర్ణ గోరును కత్తితో కోసిన ఏమాత్రము నొప్పికాని సుఖముగాని ఉండదు. మోక్షము పొందిన జీవుడీవిధముగ ఉండునని తెలుపు నిమిత్తమే చివరి గోరు నొప్పిలేనిదై ఉన్నది. మూడు ఆత్మల విధానము, మూడు గుణముల విధానము, జ్ఞానము యోగము యొక్క విధానము, చివరకు మోక్షము యొక్క విధానము తెల్పునదే దేవుని హస్తదర్శనము. ప్రతిమ చూపు హస్తములో

ఎంతో జ్ఞానమిమిడి ఉండగ దానిని అభయ హస్తమనడము పొరపాటు కాదా! ఆకారమున్న ప్రతిమ హస్తములో ఏ అర్థముందో, నీ చేతి హస్తములో కూడ అదే అర్థము గలదు. నీ చేతిని నీవు చూచుకొమ్మని దానిలోని అర్థము తెలుసుకొమ్మని దేవాలయములోని దేవుడు హస్తమును చూపుచున్నాడని తెలియవలయును.

యోగమునకు జ్ఞానమవసరమని "శ్రేయోహి జ్ఞాన మభ్యాసాత్" అని భగవద్గీతలో పరమాత్మ భగవంతుని రూపములో తెల్పియుండగ, మన హస్తములో కూడ యోగమును తెలుపు తెల్లని గోరుకు మరి తెల్లని చంద్రుడు ఉన్నట్లు తెలియుచున్నను కొందరు మాయ వశమై జ్ఞానముతో పనేలేదు మూతిమీద ధ్యాస పెట్టు కొమ్మనో, మూతిలోని ముక్కుమీద ధ్యాస పెట్టుకొమ్మనో, ముక్కులోని శ్వాస మీద ధ్యాస పెట్టుకొమ్మనో చెప్పడము గీతలోని దేవుని మాటను దిక్కరించడము కాదా! దేవాలయములోని ప్రతిమ హస్త సందేశమును మరచి మరెక్కడో పెట్టినట్లు కాదా! వారివారి చేతిలోని దేవుని సందేశముద్రను విస్మరించినట్లు కాదా! జ్ఞానమును చెత్తతో సమానముగ చెప్పడము మాయ యొక్క మాట కాదా! అట్లనుకొంటే భగవంతుడు జ్ఞానమును గీతలో చెప్పవలసిన పనేలేదు కదా! "శ్రేయోహి జ్ఞాన మభ్యాసాత్" అన్న మాటకు విలువే లేదు కదా! ఎవరు ఏమనుకొనిన దేవాలయములోని దేవుని హస్తములో ఎంతో సందేశముందని అది యావత్ ప్రపంచమునకు, మోక్షమునకు, గుణములకు, యోగమునకు, జ్ఞానమునకు ప్రత్యక్ష సాక్షమని తెలియాలి. పూర్వము ఉదయము లేస్తూనే హస్తమును చూచుకొనుట ముఖ్య సాంప్రదాయముగ ఇందువులలో ఉండెడిది. ఇప్పటికి ఆ సాంప్రదాయము నూటికి ఒక్క శాతము ఎక్కడయిన ఉండవచ్చును. పూర్వము ఉదయములేస్తూనే కళ్ళు తెరవగనే మొట్ట మొదటి దృశ్యముగ హస్తమునే చూచుకొనెడివారు. హస్తమును చూచుట వలన హస్తములోని రహస్యములన్ని జ్ఞప్తి తెచ్చుకొని నేను ఈ రోజంతయు మోక్షము కొరకు ప్రాకులాడెదనని తలచి పరమాత్మ చిహ్నమైన రేఖను భక్తి పూర్వకముగ కళ్ళకద్దుకొనెడివారు. పూర్వపు పెద్దల భావమునే మనము కల్గి హస్తమును చూడవలెనని, ఇతరులకు కూడ హస్తము యొక్క వివరము తెలుపవలెనని, దేవాలయములు ఆధ్యాత్మిక కేంద్రములని, ఆరాధనలు అర్థముతో కూడుకొన్నవని తెలిపితే విగ్రహారాధనను వ్యతిరేకించువారు కూడ వ్యతిరేకించక అర్థము చేసుకోగలరని తెలుపుచున్నాము.